ప్రభుత్వ వైద్యం అంతంతే..

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రైవేట్ ఆస్పత్రులకు తరలుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు





ఓపీ నమోదు కోసం క్యూలో ఉన్న రోగులు(ఫైల్)

ఆర్మూర్ టౌన్: వైద్యం కోసమని ఎంతో ఆశతో ప్రభుత్వ ఆస్పత్రి గడప తొక్కిన పేదోనికి వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది. వైద్యం అందించడానికి ఏర్పాటు చేసిన సామాజిక ఆరోగ్య కేంద్రాలు.. వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు పలు సమస్యలతో సరైన వైద్యం అందించలేక పేదలను వెక్కిరిస్తున్నాయి. ఫలితంగా తిండికి.. గుడ్డకు ఇబ్బంది పడే పేదలు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో తమ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఆర్మూర్ ఏరియా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధానంగా వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం వైద్యులు, వైద్య సిబ్బంది లేక వైద్య సేవలు కుంటుపడుతున్నాయి. ప్రతిరోజు ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో 400కు పైగా ఓపీలు నమోదవుతున్నాయి. కానీ ఇక్కడ వైద్య సిబ్బంది కొరత ఉండడంతో ప్రజలకు సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. 30 పడకల ఆస్పత్రి నుంచి 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుతో పాటు వైద్య విధాన పరిషత్ అయింది. ఏరియా ఆస్పత్రికి సుమారు 46 మంది వైద్య సిబ్బంది అవసరం ఉండగా కేవలం 13 మంది వైద్యులు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వైద్య సిబ్బంది కొరత ఉండడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యులపైనే పని భారం పడుతోంది. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు భీంగల్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వారే. కానీ వీరికి మళ్లీ డిప్యుటేషన్‌పై బోధన్ ఆస్పత్రిలో విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వైద్యులు పని ఒత్తిడికి లోనవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఏరియా ఆస్పత్రిపై దృష్టిసారించి ప్రస్తుతం వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్యాధికారులను బోధన్ ఆస్పత్రికి డిప్యుటేషన్ రద్దుచేసి ఆర్మూర్‌లోనే వైద్య సేవలు అందేలా చూడాలి. వైద్య సిబ్బంది కొరతతో కొంత మంది ప్రైవేటు బాట పడుతున్నారు. ఇటీవలే ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌కు ఎక్స్‌రే మిషన్ కావాలని గర్భిణులు కోరారు. దీంతో బాన్సువాడలో ఉన్న ఎక్స్‌రే మిషన్ అందిస్తామని చెప్పినా అవి మాటల వరకే పరిమితమయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం రూ. వేలల్లో ఖర్చు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను బోధన్ డిప్యూటేషన్‌ను రద్దుచేసి, వైద్య సిబ్బందిని, ఎక్స్‌రే, స్కానింగ్ సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టులు మంజూరు కాలేవు



ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉంది. వైద్య విధాన పరిషత్‌కు ఇంకా పోస్టులు మంజూరు కాలేదు. ఉన్న అధికారులతో వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్యుల కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– రవికుమార్, సూపరింటెండెంట్, ఆర్మూర్

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నందిపేట్: రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని మండలంలోని కుద్వాన్‌పూర్ సొసైటీ చైర్మన్ కార్తీక్‌రెడ్డి సూచించారు. నందిపేట మండలంలోని వన్నెల్ కె, సిద్ధాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ లోకహన్మాండ్లు, వీడీసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం డైరెక్టర్లు బండి చిన్నయ్య, గడ్డం మల్కన్న, సీఈవో చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు ముగిసిన శిక్షణ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ రైతు వేదికలో శిక్షణ పూర్తిచేసుకున్న వేల్పూర్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన మంచినీటి సహాయకులకు అధికారులు బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. నాలుగు రోజులుగా రెండు మండలాల గ్రామాలకు చెందిన మంచినీటి సహాయకులకు నీటి సరఫరా, నిర్వహణ, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు బాలకిషన్, రాజశ్రీనివాస్, డిప్యూటీ ఈఈ అమీర్‌ఖాన్, ఏఈ ఐఎన్‌టీపీ అమీర్‌ఖాన్, గ్రిడ్ ఏఈ సమీర్, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో బోధన్ టౌన్-1 ఏఈగా కృష్ణ బాధ్యతల స్వీకరణ



కృష్ణను సన్మానిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

బోధన్‌రూరల్: బోధన్ టౌన్ –1 ట్రాన్స్‌కో ఏఈగా పట్టణంలోని బెల్లాల్ డివిజన్ కార్యాలయంలో నాయిని కృష్ణ బాధ్యతలు చేపట్టారు. బోధన్ టౌన్ –1 (టౌన్1, అగ్రికల్చర్) ఏఈగా పనిచేసిన ఆనంద్ నవీపేట మండలానికి బదిలీ అవ్వగా కోటగిరి ఏఈగా ఉన్న నాయిని కృష్ణ బోధన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు ఆయనను సన్మానించారు. ట్రాన్స్‌కో ఏవో శివాజీ గణేశ్, ఫోర్‌మెన్‌లు పెంటయ్యచారి, గంగాధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సుందర్ రావు, రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్‌రెడ్డి, వీడీసీ సభ్యులు బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు పాఠాలు నష్టపోతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఈవోతో ఫోన్‌లో మాట్లాడి ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని సూచించారు.

మహాసభలను విజయవంతం చేయాలి




బోధన్‌రూరల్: వికలాంగుల హక్కుల సాధన కోసం ఈ నెల 25, 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక 4వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గైని రాములు కోరారు. బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, రాము, ప్రతినిధులు హరిప్రియ, భీమ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్‌ను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో రోడ్డుపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్‌ను తొలగించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ రాజుకు, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్ రావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు రఫీయొద్దీన్, తిరుపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



బోధన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అంతిరెడ్డి రాజారెడ్డిని బుధవారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సాలూర మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్లు అల్లె జనార్దన్, మందర్న రవి, ఎస్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, నాయకులు ఉన్నారు.

నందిపేట నాయకుల ఆధ్వర్యంలో..



నందిపేట్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అంతిరెడ్డి రాజారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, కంఠం చిన్నయ్య ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



పెర్కిట్: ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కల్లెం మల్లారెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకుడు ములాకిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, రెడ్డి, బి నర్సారెడ్డి, కె భోజన్న, ఇస్సాపల్లి నారాయణ, ఎల్ అనిల్, డి బీరయ్య, ఎం రాజారెడ్డి, కె నవీన్, టి మల్లయ్య, ఎన్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: నవంబర్ 1 నుంచి 30 వరకు నిర్వహించే అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ అన్నారు. పట్టణంలో బుధవారం చంద్రపుల్లారెడ్డి పార్టీ నాయకులు అమరవీరుల వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నవంబర్‌లో 9న హైదరాబాద్‌లో, 30న ఆర్మూర్‌లో అమరవీరుల వారోత్సవాలు జరుగుతాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ సుధాకర్, చిట్టిబాబు, సవంగి పద్మ, పెద్దులు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మ గౌరవ సభకు తరలిరావాలి



రుద్రూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నాగర్ కర్నూలు జిల్లాలో ఈ నెల 27న తలపెట్టిన మాలల ఆత్మ గౌరవ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాల పొలిటికల్ జేఏసీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ నిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ కుమార్, కిశోర్, రాయకూర్ మాజీ ఎంపీటీసీ కోర్వ శ్యామ్, మాజీ సర్పంచ్ గంగారాం, కార్తీక్, వినోద్, ప్రవీణ్, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



నందిపేట్: మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్ని మాపక సిబ్బంది మధుకర్, సురేష్, సిరాజ్, షఫీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ రాజ్‌కుమార్, హెచ్‌వోడీలు కిశోర్, లావణ్య, లక్ష్మణ్ శాస్త్రి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతం గంగారాం సంతాప సభ

బోధన్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఏఐపీకేఎంఎస్ ఉమ్మడి మండల నాయకుడు చింతం గంగారాం సంతాప సభను బుధవారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. సభకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ హాజరై మాట్లాడారు. కుల, దోపిడి రహిత సమాజం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అని పేర్కొన్నారు. ముందుగా గంగారాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, నాయకులు పడాల శంకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పేపర్‌మిల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం



రెంజల్: మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో బుధవారం రెంజల్ పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన శివకుమార్ అనే విద్యార్థికి డెంగీ సోకడంతో గ్రామంలో వైద్య సిబ్బంది అప్రమత్తమై ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త నమూనాలను సేకరించారు. అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు రవీందర్, శ్రావణ్‌కుమార్, డాక్టర్ ఉమా, సిబ్బంది ఇమ్రాన్, రామకృష్ణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించాలి



కమ్మర్‌పల్లి: వయసుకు తగ్గ బరువులేని చిన్న పిల్లలను గుర్తించాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రామ్‌పై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఏసీడీపీవో హాజరై మాట్లాడారు. పోషణ లోపం తీవ్రంగా ఉన్న పిల్లలను గుర్తించి, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సిబ్బంది కలిసి సమన్వయంతో వారి ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు గంగహంస, సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ స్వరూప, రాంబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో బుధవారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి గౌతంరాజు మాట్లాడుతూ.. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. సిబ్బంది ప్రణీత్, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను తహసీల్దార్ గజనాంద్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారం బుధవారం తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం మధ్యాహ్న భోజనంలో పురుగు లు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు మేరకు అధికారులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఏబీసీ సెంటర్‌కు కుక్కల తరలింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో పురప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శానిటరి ఎస్సై పర్యవేక్షణలో సిబ్బంది కుక్కలను పట్టుకొని జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని రెండో వార్డులో అధికారులు కుక్కలను తరలింపు చర్యలు చేపట్టారు. కాలనీల్లో కుక్కల వల్ల చిన్నారులు భయపడుతున్నారని కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత అన్నారు. అధికారులకు కుక్కల బెడద తొలగించాలని కోరగా కాలనీల్లో కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు.

సంతకాల సేకరణ

నిజామాబాద్‌అర్బన్: ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గిరిరాజ్ కళాశాలలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల యూనిట్ సెక్రెటరీ చక్రి మాట్లాడుతూ.. గతంలో జీజీ కళాశాలకు బస్సు సౌకర్యం ఉండేదని ఏడాది నుంచి కళాశాలకు బస్సులను పునరుద్ధరణ చేయలేదన్నారు. బస్టాండ్ నుంచి కళాశాల వరకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దినేశ్, సుజిత్, నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

సిరికొండ: ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్ నాయక్‌ను సిరికొండ లొంక ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. లొంక క్షేత్రానికి వెళ్లే మార్గంలో వాగులపై వంతెనల నిర్మాణానికి రూ. మూడు కోట్ల నిధులు మంజూరు చేసి నందుకు సీఈని సన్మానించారు. దొండ్ల వాగుపై శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఈకి విన్నవించారు. మార్చి లోపు నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు బడాల సంతోష్, కనగందుల గోపి, అవదూత గంగాధర్, దాస రి మారుతి, బోయిడి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

బోధన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయకపోవడం సరికాదన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన సీపీఎం 2వ బోధన్ ఏరియా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు గంగాధర్ అప్పా ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించి సభను ప్రారంభించారు. మిగిలిపోయిన రూ.2 లక్షల పంట రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే నడిపించాలని పేర్కొన్నారు. అనంతరం పార్టీ ఏరియా కార్యదర్శిగా శంకర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. నాయకులు యేశాల గంగాధర్, కుమార స్వామి, బాలయ్య, జంగం గంగాధర్, నన్నేసాబ్, గోవింద్, సాగర్, ఎం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ అధికారి

బోధన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా ఇంటర్ అధికారి టి రవి కుమార్ ఆదేశించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతి గదికి హాజరయ్యేలా చూడాలని సూచించారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ మధుమలాంచ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు తీరు, ప్రయోగశాల గదులను పరిశీలించిన అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. రానున్న అర్ధవార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినందున వెంటనే ప్రయోగాల ద్వారా విద్యాబోధన ప్రారంభించాలని పేర్కొన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగు నీటికి ఇబ్బందులు రానీయొద్దు



రెంజల్: గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాగునీటి అవసరాలను గుర్తించి ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్ పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లల విడుదల



బోధన్: పట్టణ కేంద్రంలోని పాండు చెరువు, చెక్కి చెరువుల్లో బుధవారం ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న చేప పిల్లలను స్థానిక తహసీల్దార్ విఠల్, ఏవో సంతోష్, మత్స్యశాఖ అధికారులు విడుదల చేశారు. మత్స్యకారుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న వందశాతం సబ్సిడీ చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. వివిధ రకాల చేపపిల్లలను చెరువుల్లో వదిలారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరుణ్, మత్స్య సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు కోట అబ్బయ్య, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో పశువులకు టీకాలు



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. 48 పశువులకు టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి, సిబ్బంది, గోపాల మిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌కు చెందిన ఎల్ గంగామణి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు మెరుగైన వైద్యం కోసం రూ.1.25లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వం మంజూరు చేసింది. ఎల్‌వోసీ ప్రతిని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – మిస్టర్ ఫర్‌ఫెక్ట్(తెలుగు)-10.20 1.30 7.10 10.20
- స్కీన్-2 – దేవర పార్ట్-1 (తెలుగు)-11.15 2.50 6.25 10.00
- స్కీన్-3 – జనక అయితే గనక(తెలుగు)-12.45 లవ్‌రెడ్డి(తెలుగు)-3.45 వేట్టయన్(తెలుగు)-8.45 10.15
- స్కీన్-4 – విశ్వం (తెలుగు)-12.15 10.00 వేట్టయన్(తెలుగు)-3.00 జనక అయితే గనక(తెలుగు)-7.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పషియన్)

- స్క్రీన్-1 విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
- స్క్రీన్-2 జనక అయితే గనక(తెలుగు)-1.30 7.35 మిస్టర్ పర్‌ఫెక్ట్(తెలుగు) - 4.30 వేట్టయన్(తెలుగు) - 10.30
- స్క్రీన్-3 వేట్టయన్(తెలుగు)- 10.30 4.35 మిస్టర్ పర్‌ఫెక్ట్ (తెలుగు)-1.40 వెనమ్ ది(తెలుగు3డీ)-7.40 వెనమ్ ది (ఇంగ్లీష్ 3డీ)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 వేట్టయన్(తెలుగు)-12.20 దేవర పార్ట్-1(తెలుగు)- 3.50 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ ఇంగ్లీష్)-7.25 10.00
- స్క్రీన్-2 విశ్వం(తెలుగు)-12.45 6.30 ది వైల్డ్ రోబోట్(3డీ ఇంగ్లీష్)-4.00 జనక అయితే గనక(తెలుగు)-9.45
- స్క్రీన్-3 జిగ్రా(హిందీ)-11.50 6.40 వేట్టయన్(తెలుగు)-3.10 విక్కీ విద్యా క ఓ వాలా వీడియో (హిందీ)-10.00
- స్క్రీన్-4 దేవర పార్ట్-1(తెలుగు)-12.30 7.05 జనక అయితే గనక - 4.05 10.40

- లలితామహల్ దేవర పార్ట్-1(తెలుగు)
- దేవి జనక అయితే గనక (తెలుగు)
- నటరాజ్ విశ్వం (తెలుగు)
- విజయ్ వేట్టయన్(తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,700	వెండి (కిలో)	1,03,000
22 క్యారెట్స్	75,387		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800